క్లుప్తంగా

ముళ్ల పొదల తొలగింపు



తొలగించిన ముళ్ల పొదలు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామం సమీపంలోని కాళంగి నదిపై నిర్మించిన వంతెన మలుపు వద్ద ముళ్ల పొదలను తొలగించారు. 10వ తేదీన సాక్షి దినపత్రికలో 'మలుపులో ముళ్ల పొదలను తొలగించండి' అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై స్పందించాల్సిన ఆర్అండ్బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎస్ఐ వెంకటనరసింహం వంతెన మలుపువద్ద ఉన్న పెద్దపెద్ద ముళ్ల పొదలను జేసీబీ యంత్రంతో తొలగించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వాహనదారులు హర్షం చేస్తున్నారు.

విద్యతోనే అభివృద్ధి



విద్యార్థులకు దుస్తులు, విద్యా సామగ్రి అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: విద్యతోనే గిరిజనులు అభివృద్ధి చెందవచ్చని యువ నేస్తం అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో విద్యార్థులకు నూతన దుస్తులు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు. పిల్లలు చదువుకుంటే భవిష్యత్తులో ఎస్టీ గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం తమవంతు సేవ చేస్తున్నట్లు వెల్లడించారు. దాతలు ముందుకొచ్చి గిరిజనులకు ఆదుకోవాలని చెప్పారు. యువనేస్తం అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు వినోద్, మండల కో–ఆర్డినేటర్ అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం



ఏర్పేడు సమీపంలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

ఏర్పేడు: వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యమని ఎస్పీడీసీఎల్ ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రాజులపాలెం, బండారుపల్లి, ఏర్పేడు గ్రామాల్లో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ముసలిపేడు ఉప కేంద్రంలో పాలిమర్ ఇన్సులేటర్స్ మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషిచేస్తున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ బకాయిలను చెల్లించాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ




రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర



రూరల్ సీఐ మురళీకృష్ణ

రేణిగుంట: రేణిగుంట అర్బన్, రూరల్ సీఐలు శరత్‌చంద్ర, మురళీకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జున, శివరాముడు తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో రేణిగుంట అర్బన్ స్టేషన్‌లో సీఐగా శరత్‌చంద్ర ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అలాగే గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐగా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. వీరికి సిబ్బంది, పురప్రముఖులు పుష్పగుచ్ఛాలను అందించి సాదరంగా ఆహ్వానించారు. మండలంలో శాంతి, భద్రతల పరిరక్షణకు కృషిచేస్తామని, ప్రజలు పోలీస్ వ్యవస్థతో సత్సంబంధాలు కలిగి ఉండి మెరుగైన పోలీసింగ్ వ్యవస్థ ఏర్పాటునకు సహకరించాలని వారు కోరారు.

శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐగా గోపి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐగా గోపి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నరసింహారావు తిరుపతి ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గోపీ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

సత్యవేడు సీఐగా మురళి



సత్యవేడు: సత్యవేడు సీఐగా ఎం.మురళి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి కల్యాణీడ్యాం పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో పనిచేస్తూ బదిలీపై సత్యవేడు వచ్చారు.

దొంగల సంత

- ప్రతి శనివారం వారపు సంతలో సెల్‌ఫోన్ల చోరీ
- పోలీసుల నిఘా ఉన్నా చోరీలు
- లబోదిబోమంటున్న బాధితులు



రేణిగుంట వారపు సంత

రేణిగుంట: రేణిగుంట వారపు సంత..ఎండు చేపలకు ప్రసిద్ధిగాంచిన ఈ సంతలో ఇటీవల దొంగల బెడద ఎక్కువగా ఉంది. జేబులో ఉన్న సెల్‌ఫోన్లు ఎలాంటి స్పర్శ లేకుండా చాకచక్యంగా కొట్టేస్తున్నారు. ప్రతివారం సంతకు వచ్చిన వారి నుంచి కాస్త ఏమరుపాటుగా ఉంటే సెల్‌ఫోన్లు మాయం చేస్తున్నారు. ఓ వైపు పోలీసులు సంతలో తిరుగుతున్నా.. వారి కళ్లుగప్పి వరుస చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో క్షణాల్లో తేరుకున్నా, దొంగలించిన ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో చేసేది లేక బాధితులు నిర్వేదంతో తలలు పట్టుకుంటున్నారు.

రేణిగుంట సినిమా వీధి సమీపంలో ప్రతి శనివారం వారపు సంత పెద్ద ఎత్తున జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాలు, జిల్లాలు, తమిళనాడు రాష్ట్రం నుంచి కూడా ఈ సంతకు కూరగాయలు, ఎండు చేపలు కొనుగోలు చేసేందుకు ప్రతివారం అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రధానంగా సాయంత్రం జనంతో సంత ప్రాంగణమంతా కిక్కిరిసి పోతుంది. పక్కకు తొలగడానికి కూడా సందు దొరకని రద్దీ ఉంటుంది. అయితే సంతలో దొంగల ముఠా తిష్ట వేసి ప్రధానంగా మొబైల్ ఫోన్లను దొంగలిస్తున్నారు. సంతకు వచ్చే వారిలో కాస్త అమాయకంగా కనిపించినా, మొబైల్ ఫోన్ పైజేబులో పెట్టుకున్న వారిని ఈ ముఠా గుర్తించి వారి నుంచి సెల్‌ఫోన్ కొట్టేసేందుకు పథకాన్ని రచిస్తారు. అందరూ కలసి సంచులు చేతపట్టుకుని ఎలాంటి అనుమానం రాకుండా కూరగాయలు కొంటున్నట్లు వెంబడిస్తారు. ఓ పక్క కూరగాయలు కొనుగోలు చేస్తుంటే వీరు తోపులాటను సృష్టించి ఎలాంటి స్పర్శ తెలియనివ్వకుండా క్షణాల్లో జేబుల్లో నుంచి మొబైల్ ఫోన్లు కొట్టేస్తారు. బాధితులు తేరుకుని వేరొకరి ఫోన్ నుంచి డయల్ చేసినా అప్పటికే స్విచ్ ఆఫ్ చేసి మొబైల్‌లను మాయం చేస్తారు. ఉదయం నుంచి పోలీసు సిబ్బంది సంతలో నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నా, వారి కళ్లు గప్పి దొంగతనాలను మాత్రం ప్రతి వారం యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఎంతో మంది బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా రికవరీ లేకపోవడంతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారిలో ఎక్కువ మంది ఫిర్యాదు చేయకుండానే నిరాశతో ఇంటిముఖం పడుతున్నారు. ఓ ముఠానే పక్కా ప్రణాళికతో ప్రతి వారం సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసు అధికారులు సంతలో సెల్‌ఫోన్ల దొంగతనాలను కట్టడికి చర్యలు చేపట్టాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

క్షణాల్లో మాయం

నేను రేణిగుంట వారపు సంతకు కూరగాయలు కొనుక్కునేందుకు వెళ్లి రూ.40వేల విలువైన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాను. నేను కూరగాయలు తీసుకుంటుండగా నా జేబులో ఉన్న సెల్‌ఫోన్ రెప్పపాటులో మాయమైంది. పోలీసు సిబ్బంది అక్కడే ఉన్నారు. పక్క వారి నుంచి ఫోన్ తీసుకుని నా ఫోన్‌కు రింగ్ చేశాను. అప్పటికే స్విచ్ ఆఫ్ చేసేశారు. ప్రతివారం దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసు అధికారులు చర్యలు తీసుకుని దొంగల ముఠాను పట్టుకుని ఫోన్లు రికవరీ చేయాలి. – ఉమేష్, రేణిగుంట

సంత రోజు పోలీసు నిఘా

సంతలో ట్రాఫిక్ నియంత్రణకు, దొంగల కట్టడికి ప్రతి శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. అయినా తరచూ మొబైల్ ఫోన్ల దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పటిష్ట నిఘాను పెంచడంతో పాటు సాంకేతిక సహకారాన్ని తీసుకుని దొంగల ముఠాను పట్టుకుంటాం. – సునీల్‌కుమార్, ఎస్ఐ, గాజులమండ్యం, రేణిగుంట మండలం

ఘనంగా గంగమ్మకు క్షీరాభిషేకం

- రేణిగుంట గంగమ్మ జాతరకు అంకురార్పణ



విశేష అలంకరణలో అమ్మవారు

రేణిగుంట: రేణిగుంట గంగమ్మ జాతరకు అంకురార్పణ జరిగింది. ప్రతిఏటా ఎంతో వైభవంగా జరిగే జాతరను ఈసారి కూడా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పాలాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మంగళ వాయిద్యాలతో 1,008 పాల బిందెలతో మహిళలు ఎర్రటి వస్త్రాలు ధరించి వేపాకు చుట్టిన పాలకుండను నెత్తిన పెట్టుకుని నడి వీధి గంగమ్మ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి పాల కుండలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. అమ్మవారికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించారు.

13, 14 తేదీల్లో జాతర

12వ తేదీ రాత్రి గెరిగ ఊరేగింపుతో జాతర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13న గంగమ్మ జాతర, గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్లు, నడి వీధి గంగమ్మ వద్ద అంబళ్లు, అమ్మవారి విశ్వరూప దర్శనం, 14న ఉదయం నడివీధి గంగమ్మ ప్రతిష్ట, రాత్రి వరకు మహా దర్శనం, నైవేద్య సమర్పణ కార్యక్రమాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆలయ పెద్దలు ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



అమ్మవారి అభిషేకానికి పాలకుండలను తీసుకెళుతున్న భక్తులు

నూతన రకాలతోనే మంచి దిగుబడులు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: నూతన రకాల సాగు ద్వారానే రైతుకు మంచి దిగుబడులు సాధ్యమని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసులు అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆహార, ఉద్యాన పంటల్లో రూపొందించిన 109 పంట రకాలను భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం న్యూఢిల్లీలోని పూసా పరిశోధనా స్థానం నుంచి జాతికి అంకితం చేసిన సందర్భంగా ఆదివారం గొల్లపల్లిలో రైతులు శాస్త్రవేత్తలు చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐసీఏఆర్, అనుబంధ సంస్థలు కొన్ని సంవత్సరాలుగా వరి, వేరుశనగ, చెరకు, కంది, శనగ, చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటల మొదలైన పంటల్లో నూతన రకాలను రూపొందించారన్నారు. నూతన రకాల లక్షణాలు, సాగు పద్ధతులు, వివిధ పంటల్లో బయోఫోర్టిఫైడ్ రకాల ప్రాముఖ్యత, సేంద్రియ సాగు విధానం, పంట మార్పిడి, భూసార యాజమాన్యం వ్యవసాయ డ్రోన్‌ల వినియోగం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ సాగులో వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు సుధాకర్, రామ్‌కుమార్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం



కళాకారులను సన్మానిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మన సంస్కృతి కళా సంస్థ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రంగాని సహదేవనాయుడు అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో ఆదివారం భజన, భక్తి, జానపద గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెరమరుగు అవుతున్న నాటి సంస్కృతి, కళారూపాల జానపద గేయాలను, భక్తి, భజన పాటలను నేటి సమాజానికి అందించాలనే ముఖ్య ఉద్దేశంతో మన సంస్కృతి కళా సంస్థ కృషిచేస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి కె.రెడ్డెప్ప మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో తమ సంస్థ తరఫున జానపద భక్తి గేయాలను ఆలపించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు అనుమతించిన ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాకారులను సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య సన్మానించారు. రమణమ్మ, వెంకటస్వామి, మునిరామయ్య, రవిబాబు, వెంకటేష్, నాగరాజు, శ్రీనివాస్, నాగమణి, సరళ, భాగ్యమ్మ, నీరజ, వెంకటాద్రి, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, కృష్ణయ్య, గుమ్మడి మురళి, గజేంద్రబాబు, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



నెలవాయిలో విరాళాలు సేకరిస్తున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలో ఆదివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో కుండపోత వర్షంతో వయనాడ్ జిల్లాలోని కొన్ని గ్రామాలు పూర్తిగా కొట్టుకుపోయాయని తెలిపారు. దీంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, చాలా కుటుంబాలు నిరాశ్రయులు అయ్యారన్నారు. వీరిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పిలుపు మేరకు నెలవాయి గ్రామంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనంజయలు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించామని తెలిపారు. వసూలైన నగదును రాష్ట్ర కమిటీ ద్వారా కేరళకు పంపిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, నేతలు శంకరయ్య, మండల కార్యదర్శి తిరుపాల్, మల్లికార్జున్, కేశవులు, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, కోదండం, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సర్వేపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీకాళహస్తి రూరల్: ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం– పరివర్తన స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఎర్రగుడిపాడు, గంగలపూడి, ఈశ్వరయ్య ఎస్టీ కాలనీలో యానాదులు సంచార తెలుగు జాతుల సర్వే నమోదు చేసుకోవడంపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల వారి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అలాగే ప్రభుత్వం అందించే రుణాల ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసి అభివృద్ధి చెందాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో లేని ఎస్టీ కాలనీలో కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, పరివర్తన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లం అమర్నాథ్, సంస్థ వలంటీర్లు ఉష, గౌరి, రమణ, చెంచమ్మ పాల్గొన్నారు.

ఏర్పేడు విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

ఏర్పేడు: షూటింగ్ బాల్ పోటీల్లో ఏర్పేడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్ఎం సునీత ఆదివారం తెలిపారు. ఈనెల 10, 11వ తేదీల్లో చిత్తూరు జిల్లా, వి.కోట హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగినట్లు పేర్కొన్నారు. ఏర్పేడు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, జయవర్ధన్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రతిభ చూపడంపై పీఈటీ శివకుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముక్కంటి సేవలో బట్టి విక్రమార్క



ఆలయ ధ్వజస్తంభం వద్ద బట్టి విక్రమార్క

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కోలాహలం.. అంకాళమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ



ముక్కుపుడకను ఇస్తున్న నరసింహారావు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీ రోడ్డులో వెలసిన అంకాళమ్మ జాతర ఆదివారం కోలాహలంగా జరిగింది. జాతర సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మరాఠిపాళెంకు చెందిన నరసింహారావు అమ్మవారికి బంగారు ముక్కుపుడకను బహూకరించారు. అర్చకులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న మాధవరెడ్డి శ్రీరామ్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. అతను విధులకు వచ్చిన సమయంలో రాత్రి ఆయన ఇంటి వద్ద గల ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై మాధవరెడ్డి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్యాపకులకు అందని వేతనాలు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో తాత్కాలిక అధ్యాపకులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు లేకుండా నరకయాతన అనుభవిస్తున్నా, వర్సిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో దాదాపు 54 విభాగాల్లో 240 మంది అకడమిక్ కన్సల్టెంట్లు, 40 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు ఇంతవరకు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన చెందుతున్నారు. కోర్టు ఉత్తర్వులతో జూన్ 24న విధుల్లో చేరిన అధ్యాపకులకు మాత్రం వేతనాలు సమయానికి చెల్లించారని, గత కొన్ని ఏళ్లుగా బోధన, పరీక్షల నిర్వహణలో తాము ప్రధాన పాత్ర వహిస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



రాజేంద్రకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చక్రవర్తి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు రాజేంద్ర గౌరవ భారత సేవారత్న ప్రతిభా అవార్డు అందుకున్నారు. విద్యార్థుల్లో దేశభక్తి గేయాలు పాటించడం, దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు కల్పించారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు కడపగండ్ల చక్రవర్తి చేతులమీదుగా ఆయనకు భారత సేవారత్న ప్రతిభా అవార్డును అందజేసి సన్మానించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్ సిటీ కల్చరల్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు




దినేష్‌వర్మ



ఆంజనేయులు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్‌జోన్ సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం కర్నూలు–చిత్తూరు జట్లు తలపడ్డాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 48.4 ఓవర్లకు 170 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో దినేష్ వర్మ 74 పరుగులు చేశాడు. కర్నూలు జట్టు బౌలింగ్ విభాగంలో ఆంజనేయులు 5 వికెట్లు, ఇస్మాయిల్ 3 వికెట్లు తీసుకున్నారు. 54 పరుగుల తేడాతో కర్నూలు జట్టు ఆధిక్యంలో ఉంది.

ఎమ్మెల్యే సారూ అండగా నిలవండి



గుణశేఖర్ మృతదేహం

శ్రీకాళహస్తి: మట్టి అక్రమ తవ్వకాలు ఓ నిండు ప్రాణాలను బలిగొంది. తొట్టంబేడు మండలంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు ధనదాహానికి ఓ పేద కుటుంబానికి చెందిన యువకుడు మృతిచెందాడు. హడావుడిగా మట్టిని తరలించే క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ కింద విశ్రాంతి తీసుకుంటున్న పేద కుటుంబానికి చెందిన డ్రైవర్ మీదుగా ట్రాక్టర్ వెళ్లడంతో అతను మృతిచెందాడని మృతుని కుటుంబసభ్యులు అంటున్నారు. ఎమ్మెల్యే చెబితే గ్రావెల్‌ను సరఫరా చేస్తున్నాం, మీరు ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరిస్తున్నారన్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే అయినా మాకు అండగా ఉండాలని బాధితులు కోరుతున్నారు. గ్రామస్తుల కథనం మేరకు కల్లిపూడి గ్రామానికి సమీపంలో ఉన్న కొత్త చెరువు, రౌతుగుంట చెరువుల్లో గత వారం రోజులుగా కొందరు అధికార పార్టీ నేతలు జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేసి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులోభాగంగా బుచ్చినాయుడుకండ్రిగ మండలం భవానీ శంకరాపురం గ్రామానికి చెందిన గుణశేఖర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఇతను ట్రాక్టర్ ట్రాలీ కింద విశ్రాంతి తీసుకుంటుండగా యజమాని చూసుకోకుండా అతనిపై ట్రాక్టర్ ఎక్కించాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ విషయాన్ని తొట్టంబేడు మండల టీడీపీ నేతలు తొక్కిపెట్టాలని చూడగా ఎట్టకేలకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మాల యోధుల్లారా కదలిరండి

శ్రీకాళహస్తి: మాల యోధుల్లారా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని ప్రతి మాల సోదరుడు పాల్గొని వర్గీకరణను అడ్డుకోవాలని జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ కోరారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రతో మాల మాదిగలను విడదీసి క్రిమిలేయర్ అనే భూతాన్ని ప్రవేశపెట్టి రిజర్వేషన్లను తీసేయాలని నెపంతో వర్గీకరణ చేపడుతున్నారని ఆరోపించారు. ఉదయం పది గంటలకు దీనికి వ్యతిరేకంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు.

యాళి వాహనంపై ద్రౌపదీదేవి అభయం



విశేష అలంకరణలో ద్రౌపదీ సమేత అర్జునుడు

పుత్తూరు: శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి యాళి వాహనంపై ద్రౌపదీ సమేత అర్జున స్వామి భక్తులకు అభయమిచ్చారు. పురవీధుల్లో ఇంటింట భక్తులు కర్పూర హారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి స్వర్ణలత హరికథా గానం సాగింది. సాయంత్రం పాండవ, కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం ఆకట్టుకుంది. ఈసందర్భంగా తిరుపతికి చెందిన నాగరత్నమ్మ పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్లను యాళి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు బెస్త సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం లక్కాగృహ దహనం ఘట్టాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమాలను సౌశ్యాకం వంశీకులైన ఆలయ కోవిల్‌కార్లు ఏలుమలై మొదలి, నటరాజ్ మొదలి, గోపి మొదలి, వెంకటేష్ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు. సోమ వారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు సాయంత్రం 4 గంటలకు హిడింబాసుర వధ, రాత్రి 8 గంటలకు శేష వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది.